మేలుకొలుపు

ఊర్వశి

రంగడంటే శారదమ్మకు అమితమైన భయం. కాని రాజారావుకు రంగడంటే ఎందుకో నమ్మకం, అభిమానమున్నూ. శారదమ్మ దృష్టిలో రంగడు ఒక దొంగా, ఒక భయంకరమైనవ్యక్తీ ఆమె కీ అభిప్రాయం కలగడానిక్కారణం రంగడి వేషధారణ మేకాక అత డాయింట ప్రవేశించినరోజే రాజారావు అతనిగురించి చెప్పిన ఉదంతం చాలావరకు కారణం. రాజారావు తన నోటితోనే చెప్పాడు: 'రంగడు ఒక దొంగ' అని. వాడు దొంగతనం చేయడం తాను కళ్ళారా చూచానని వాడిని దొంగగా ఊహించే కన్నా వాడిని మంచివాడిలా చేయడానికి

మన మెందుకు ప్రయత్నించకూడదు అని భార్యతో వాదించాడు రాజారావు. దాని పర్యవసానమే రంగడా యింటిలో ఉండ డాని కామె అంగీకరించడం; అది ఆమెకు పూర్తిగా యిష్టంలేదు. కాని భర్తతో ఘర్షణపడటం యిష్టంలేక ఊరుకున్నది

'అసలా ఇంటిలోకి రంగడెలా ప్రవేశించాడు?' అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకునేలోగా రాజారావును గురించి కాస్త చెప్పుకోవాలి. రాజారావుది స్వతహాగా జాలిగుండె; కాని భయస్తుడు మాత్రం కాదు. ఒకవిషయాన్ని శోధించి, తరచి చూడాలన్న తాపత్రయం అతని కెప్పుడూ ఉంటుంది. దారిప్రక్కన అడుక్కునే బిచ్చగాండ్రు అతనికొక సమస్య. 'వీళ్ళెందుకు బిచ్చగాళ్ళయ్యారు? వీళ్ళ జీవితాలను మార్చలేమా? ఏం చేస్తే మనదేశంలో బిచ్చగాళ్ళు, దొంగలు లేకుండ పోతారు?' అని ఆలోచించేవాడు. ఇదే విషయాన్ని నలుగురితో ఆలోచించ ప్రయత్నిస్తాడు. ఓసారి అతనిమిత్రుడొకడు అతను చెప్పినదంతా విని "నీవు చెప్పిందంతా ఒకవ్యాసంగా వ్రాసి ఏ పత్రికకు పంపు వారు 'రెమ్యూనరేషన్' పంపవచ్చు" అని సలహా యిచ్చి చక్కాపోయాడు. ఇంకొక మిత్రుడు రాజారావు చెప్పింది విని 'మనం ఆలోచిస్తుంటే అన్నీ సమస్యలే. అందుకని నేనాలోచించడం మానేశాను, అన్నాడు సీరియస్‌గా. కాని రాజారావుమాత్రం నిరుత్సాహపడలేదు. బిచ్చగాళ్ళు, దొంగలు వాళ్ళ జీవితాలలో ఎలా మార్పుతేవడం అని ఆలోచిస్తూనే ఉండేవాడు. బజారులో తటస్థపడే ప్రతి బిచ్చగాడినీ చూస్తూనే ఉండేవాడు. ఒక రోజు ఏం జరిగిందంటే —

* * *

అవి వేసంగిరోజులు. వివిధరకములైన మామిడిపళ్ళ కాలం అన్నమాట. బజారులో రైల్వేవారి గోడ కానుకుని తాత్కాలికంగా ఏర్పడ్డ దుకాణాలనిండా మామిడిపండ్లే. ఒక దుకాణానికి ఇంకొక దుకాణానికి గల అడ్డుగోడలు మామిడిపండ్ల బుట్టలే.

మామిడిపండ్లబేరాలలో చాల హడావుడిగా వున్నారు వర్తకులు కొనేవారితో, అమ్మేవారితో బజారు చాలా సందడిగా వుంది. దుకాణదారుడికి ఎవరు వస్తున్నదీ, ఎవరు పోతున్నదీ చూచేపాటి తీరికగూడ లేదు. అలాంటి సమయంలో ఆ సాయంకాలంనాడు, ఒక వృద్ధకాయుడు — పెరిగిన గడ్డంతో, తైలసంస్కారంలేని తలతో, చిరిగిన చొక్కా, పంచెలతో ఒక దుకాణంముందు సాక్షాత్కరించి, అడ్డుగోడగానున్న మామిడిపండ్ల బుట్టల్లో ఒక బుట్టలోంచి మాంచి మామిడిపండును తీసి, దానిని కాస్త నిదానంగా పరీక్షించి, అటుయిటు చూచి ఆ పండును కొరుక్కు తినడం రాజారావు కంట పడింది. రాజారావు అతగాడి

చర్యలన్నీ గమనిస్తూనే ఉన్నాడు. రాజారావు తనను గమనించడం కూడ అతను చూచాడు. కాని అతనిముఖంలో కంగారుగాని, కళ్ళలో భయంగాని రాజారావుకు గోచరం కాలేదు రాజారావును నిర్లక్ష్యంగా చూచి తనపనిలో తాను మునిగిపోయాడు. దగ్గరేఉన్న ఒక రాయిమీద కూర్చుని అతను

రాజారావు అతని ప్రవర్తనకు అచ్చెరువోయాడు నెమ్మదిగా వాడిదగ్గరి కెళ్ళాడు రాజారావు

"నీవు పండు తీయడం, తినడం నేను చూచాను" అన్నాడు రాజారావు అతడితో

"మీరు చూడటం నేనూ చూచాను" అన్నాడతను.

"నీవు చేసింది తప్పు కాదా ?"

"నే నేం చేశాను ?"

"నీ చేతిలో వున్న పండు దొంగి లించిందికాదా ?"

"ఆకలేసింది. పండు కనపడింది తీశాను. తింటున్నాను. తప్పా ?"

"తప్పుకాదా మరి ? దొంగతనం చేయడం నేరం. అది ప్రభుత్వానికి తెలిస్తే తప్పక శిక్ష వేస్తారు."

"జైలులో పెడతారుకదూ ?"

"అవును" అన్నాడు రాజారావు

పెద్దపెట్టున నవ్వా డతను

జైలు. హూ ! జైలునాకు క్రొత్తచోటు కాదు. జైలుకు చాలాసార్లు వెళ్ళాను జైలుఅంటే నాకు భయంలేదు ఇప్పుడు పోలీసులకు చెప్తారా ? పదండి నేనూ వస్తాను. కాని మీకు తెలియదు, ప్రతి పోలీసుకూ హెడలే ఈరంగడంటే నాకు చావంటే భయంలేదు. చంపడమంటే సంకోచంలేదు" అన్నాడు గర్వంగా గడ్డం దువ్వుకుంటూ

"నీవు దొంగతనం ఎందుకు చేస్తున్నావో చెప్పగలవా?" ప్రశ్నించాడు రాజారాజావు..

"తిండికోసం" అన్నాడు కడుపు చరుచుకుంటూ.

"అయితే తిండి దొరికితే దొంగతనం మానేస్తావా ?"

'తిండి దొరుకుతుందా ? దొంగతనం మానెయ్యాలా ?' అని ఆలోచనలో పడ్డాడు. వెంటనే "తిండి ఎలా దొరుకు తుంది ?" అని ప్రశ్నించాడు

"నీకు ఉద్యోగం యిప్పిస్తాను" అన్నాడు రాజారావు

"ఉద్యోగం. హే !" అంటూ పెద్ద పెట్టున నవ్వి "ఉద్యోగం అంటే పని చెయ్యడమేనా? పని చెయ్యడమంటే ఈ శరీరం ఎప్పుడో అలవాటు తప్పింది. ఉద్యోగం వద్దు. సద్యోగం వద్దు; నన్నిలా బ్రతుకనివ్వండి" అన్నాడు.

"నీవు కష్టపడటం యిష్టంలేకపోతే పోనీలే. నీవు కష్టపడకుండా నీకు తిండి ఏర్పాటు చేయిస్తాను" అన్నాడు రాజా రావు.

"కష్టపడకండ తిండి దొరకుతుందా?

అదెలా సాధ్యం? ఇందులో మోసం లేదుకదా?"

"లేదు ఏమీ మోసంలేదు. నా యింటిలో నీకు తిండి ఏర్పాటు చేయిస్తాను. నీవు నడుం వంచనక్కరలేదు. కాలు కదపనక్కరలేదు."

"పని చెయ్యక్కరలేదు. తిండి దొరుకుతుంది."

"బావుంది. చాలా బావుంది. కాని నేను ఏం చేయాలి?"

"నీవు ఒక్కపని మాత్రం చేయాలి."

'ఏమిటి?"

"దొంగతనం చేయకూడదు."

"నీమీద దయకాదు నీ వృత్తిమీద అసహ్యం. దొంగతనం చేసే నీకు దొంగతనంవల్ల ఎన్ని కుటుంబాలు నాశనమౌతున్నాయో తెలియదు. మా ప్రక్కయింటిలో దొంగలు పడి యిల్లు కొల్లగొడితే ఆయింటి యజమాని ఆ కుటుంబానిని పోషించలేక ఒకరాత్రి యిల్లు విడిచి వెళ్ళిపోయాడు."

'ఆ కుటుంబం ఏమైందో తెల్సా!"

"ఏమయింది?" అన్నాడు ఆత్రుతగా.

"పాపం ఆ కుటుంబాన్ని ఆదుకునేవారెవరూ లేకపోయారు చివరకా కుటుంబం పుట్టకొకరు చెట్టుకొకరు అయ్యారు. ఆ దొంగమాత్రం ఏం సుఖపడిఉంటాడు? ఎప్పుడో ఒకప్పుడు పోలీసులకు దొరికేఉంటాడు. బాధలు పడే ఉంటాడు నీవుకూడా నీ జీవితంలో అలాంటి పనులేవీ చేయలేదని నేననుకోను అందుకేగా నిన్నీవృత్తి మానేయమంటున్నది. నీకు కావలిసినది తిండేగా. అదేదో నేనే నీకు యిస్తాను. నీవు నా వెంట వస్తావా? నీవు త్వరగా తేల్చి చెప్పాలి. నా కింకా చాలా పని వుంది" అన్నాడు రాజారావు.

"ఉండండి, నన్ను కాస్త ఆలోచించుకోనియ్యండి" అంటూ ఆకాశానికేసి చూస్తూ ఆలోచనలో పడ్డాడు కొద్దిసేపు రాజారావును పరీక్షగా చూచి "పదండి" అన్నాడు.

రాజారావు ఇంటికి కావలసిన కూరగాయలూ, మామిడిపళ్ళూ ఒక సంచీలో నింపుకొని రంగడిని తీసికొని యింటిముఖం పట్టాడు రంగడు రాజారావు ననుసరించాడు రాజారావు బరువైన సంచిని అప్పుడప్పుడు బరువుకు చేతులు మార్చుకోవడం చూస్తూనే ఉన్నాడు రంగడు

"బాబూ! ఆ సంచీ యిలాయివ్వండి. నేను మోస్తాను" అన్నాడు.

రాజారావు నవ్వేసి "ఫరవాలేదు; యింటిదగ్గరి కొచ్చేశాముగా" అన్నాడు.

రాజారావు కేమీ సమాధానమీయలేదు రంగడు.

ఇద్దరూ మూగగా యిల్లు చేరారు

శారద రంగడిని పరీక్షగా చూచి "ఎవరు వీ"డన్నట్లు కళ్ళతో అడిగింది రాజారావుని.



"ఇవ్వాళ చూడండి వంట. అన్నీ కిలోగ్రాముల్లో తూఁచి చేశాను "

"ఒకొప్పుడు ఇతను మా నాన్నగారి దగ్గర పని చేసేవాడు. ఇవ్వాళ సాయంత్రం బజారులో కనపడ్డాడు. తీసి కొచ్చాను. ఇతనుమనింటిలోనేఉంటాడు. ముందు మా యిద్దరికీ భోజనం తయారు చెయ్యి. వీధి వెన్నెల్లో కూర్చుంటాము" అని అబద్ధం ఆడేసి (రంగడి ముందు అతని గురించి నిజం చెప్పడం యిష్టం లేక) రంగడితో వెన్నెల్లోనున్న కుర్చీలో కూలబడ్డాడు. రంగడు రాజారావుకు కొద్ది దూరంలో అరుగుమీద చతికిలపడ్డాడు.

రాజారావు ప్రసంగం మొదలు పెట్టాడు

భారతదేశపు ఔన్నత్యమూ, భారత దేశంలో ఎలాటి మహానుభావు లుండినదీ, వారు సాధించిన ప్రయోజనాలనూ, బుద్ధుడు, ఏసుక్రీస్తు, గాంధీ, మొదలయినవారలను మనము ఎందుకు ఆదర్శంగా తీసికోవాలో, భారతదేశపు తత్త్వం ఏమిటో? చిన్నప్పుడు బంగారం దొంగిలించిన గాంధీలో ఎలాంటిమార్పు వచ్చిందో. సంతొమ్మిదవ ఏటినుండీ పద్నాలుగు సంవత్సరాలు జైలు శిక్షలో మగ్గిపోయిన 'జీన్ వాల్ జీన్' జీవితంలో 'ఫాదర్' ఎలాంటి మార్పు తెచ్చాడో, మనం దొంగతనాన్ని ఎందుకు దరిచేర నీయకూడదో, ఆ వృత్తి ఎందుకు ద్వేషించ తగ్గదో, మనిషికి జంతువుకు గల తేడా ఏమిటో, మనిషిగా బ్రతకడ మంటే ఏమిటో, మనిషికి పరువుప్రతిష్ఠ

లెందుకో, ప్రతిమనిషీ తను జీవితంలో ఉద్దేశించవలసినదేమిటో, దానిని సాధించ డానికి మానవు డేంచెయాలో, ఏం చేస్తే మానవజీవితం సార్థకమౌతుందో ఒక్క బిగిని యేకరుపుపెట్టాడు రాజారావు అందులో తన ఉద్దేశ్యాలను, ఆదర్శా లను వెల్లడిచేసాడు.

రంగడు అంతా మూగగా విన్నాడు. అందులో అన్ని విషయాలూ రంగడికి అర్థం కాకపోయినా, కొన్ని అర్ధంకాక పోలేదు. ఇంతలో శారద రాజారావును భోజనానికి పిలవడంతో లేచిపోయాడు.

''నీవు నా ప్రక్కనే కూర్చుని భోజనం చెయ్యాలీరాత్రి. రాత్రి నీవు నా అతిదివి,'' అన్నాడు రాజారావు.

''వద్దుబాబూ! నాకు ఏ ఆకులోనో ఇంత పడేయండి బాబూ. ఏమూలో కూర్చుని తింటాను.'' అన్నాడు రంగడు రాజారావు ఎంత బలవంతం చేసినా వినలేదు రంగడు శారద రంగ డికి వసారాలో, రాజారావుకు రెండు గజాలదూరంలో భోజనం వడ్డించింది రంగడు సంకోచంతో భోజనం చేశాడు.

రాత్రి పడుకోడానికి ఒక బొంతా, కాస్త మంచిదుప్పటీ ఏర్పాటుచేశాడు రాజారావు. రంగడు వీధిలోనే మేను చేరవేసాడు

రాత్రి రాజారావు శారదకు రంగడి గురించి కాస్త వివరంగా చెప్పాడు.

''దొంగా!'' అందామె కంగారుగా.

''గట్టిగా అరవకు'' అన్నాడు నెమ్మ దిగా, ఆమె నోరు మూస్తూ.

''వాడు దొంగే కాని వాడిని మంచి దారిలోకి తేవడమే నా ప్రయత్నం నీవు వాడిగురించి భయపడ నవసరంలేదు. ఒక వారంరోజులు వాడిని చాలమంచిగా చూచావంటే వాడి జీవితం పూర్తిగా మారిపోతుంది. వాడు ఒక మనిషి అవు తాడు. వాడిని మంచిమనిషిని చేయ డంలో మన బాధ్యత ఎంతైనా ఉంది,'' అన్నాడు రాజారావు.

''ఏమో బాబూ! నాకు చాల భయ మేస్తోంది. చూస్తూ చూస్తూ ఒక దొంగని యింట్లో ఎలా పెట్టుకోవడమో నా కర్థం కావటంలేదు — కావలసివస్తే వాడికి వేళ కింత తిండి — రాత్రీ పగలూ పడేస్తాను వాడుమాత్రం మనింటిలో ఉండడం సుతరామూ నా కిష్టంలేదు'' అందామె.

''పొరపడుతున్నావు శారదా! వాడికి కావలసింది తిండే అయితే, వాడు యింత దూరం మనింటికి రా నవసరంలేదు. నాలుగుయిళ్ళు అడుక్కుంటే వాడి బ్రతుకు జరిగిపోతుంది. నా వుద్దేశం అదికాదు. వాడికి మనం పెట్టే భోజనంతో పాటూ, మన ప్రవర్తనచేత వాడిలో పరి వర్తన తేవాలి. మనలో ఉన్న మంచి తనాన్ని వాడు గ్రహించాలి. వాడు మనలో మంచి గ్రహించాలి అంటే మనం మంచితనాన్ని వాడికోసం అల



"ఉదయంపూట చదువుకోక కుక్కతో ఆటేమిటి ?"
"ఇవ్వాళ కుక్కమీద వ్యాసం రాయమన్నారు."

వరచుకోవాలి మనలో మంచి అనేదే లేకపోతే వాడు మనలనుండి నేర్చుకునే దేమీఉండదు తెలిసో తెలియకో ఎప్పుడో ఒకప్పుడు ఎందుకోఅందుకు దొంగతనం చేస్తాడు. అందుకు సంఘం వాడిమీద 'దొంగ' అని ఒక చెరగని ముద్ర వేస్తుంది జైలులో నుంచి వచ్చేసిన తరువాత వాడు మంచిగా ప్రవర్తించినా, లోకం వాడిని దొంగగా వ్రేలెత్తి చూపుతుంది. ఇక వాడిలో మార్పు ఎలా వస్తుంది ? వాడు సంఘంనుండి వెలివేయబడ్డట్టు వాడు అనుకోకూడదు మనం వాడియెడల అవిధంగా ప్రవర్తించకూడదు........" అని కొద్దిసేపాగి మళ్ళీ అన్నాడు "అయినా నాదే పొరపాటు శారదా! నీవుచాలా ధైర్యవంతురాలివని, నా ఉద్దేశ్యాలను అర్థం చేసుకుంటా వనుకున్నానేగాని, ఇంతత్వరగా భయానికి లొంగిపోతా వనుకోలేదు." అన్నాడు రాజారావు

"చివరికి నింద నామీదే వేస్తున్నారు కదూ ? పోనీండి మీ మాటప్రకారమే కానీయండి మీ మీద గౌరవం చేత, మీ మాట నిలబెట్టడంకోసం, మిమ్మల్ని బాధపెట్టకుండా ఉండాలని మీ మాటకు ఒడిగడుతున్నాను. కాని, మీకుగాని, వాసుకుగాని వాడివలన ఎలాంటి ప్రమాదం సంభవించినా వాడిని నేను బ్రతుకనీయను" అందామె.

"శభాష్! నీ పట్టుదల నాకు తెలుసు

కారదా!" అంటూ వెన్నెల ఒడిలోకి ఒరిగిపోయాడు రాజారావు.

ఆవిధంగా ప్రవేశించాడు రంగ డా యింటిలో. రంగడిప్రవర్తన కనిపెట్టడం కోసం రెండురోజులు ఆఫీసుకు సెలవు పెట్టాడు రాజారావు. తోటపనిచేయడంతో కబుర్లాడటంతో రెండురోజులు యిట్టే గడిచిపోయాయి. ఆ రెండు రోజులూ రాజారావుగాని శారదగాని రంగడికి ఒక్కపనిగూడ పురమాయించలేదు. తోటలో మొక్కలకు కావలసిన నీళ్ళు అన్నీ రాజారావే తోడుకోవటం. మొక్కలకు అతడే మళ్ళు కట్టుకోవటం. ఇంటికి కావలసిన వంటసామగ్రి అతడే మోసుకురావటం. బజారుపని అంతా అతడే చూసుకోవటం. ఏ పనిలోనూ రంగడి సహాయం అర్థించకపోవటం రంగడికి చిన్నతనమేసింది. బట్టలు ఉతుక్కోవటం, 'బాబుకు' నీళ్ళు పోయటం, ఇల్లు తుడుచుకోవటం, వంటకు కావలసిన నీళ్ళన్నీ ఆమే తోడుకోవటం, ఏ చిన్న విషయంలోకూడా రంగడి సహాయం అర్థించకపోవటం తల కొట్టేసి నట్టయింది రంగడికి.

మూడవరోజు ఉదయం పూలమొక్కలకి నీళ్లు పోస్తున్న రాజారావు నదిగాడు రంగడు. రాజారావు విననట్టుగా "రాత్రి బాగా నిద్రపట్టిందా?" అని ప్రతిరోజూ లాగే పరామర్శించాడు.

"పట్టిందిబాబూ! ఆ గడ్డపార యిలా యివ్వండిబాబూ! నా కా పని చక్కగా చేతనవును. చక్కగా మళ్ళు తవ్వుతాను" అన్నాడు.

"నీ కెందుకులే ఆశ్రమ నేను చేసుకుంటానులే" అన్నాడు రాజారావు.

"అలా అనకండి బాబూ! మీరూ, అమ్మగారూ నన్ను ఒక్కపనికూడా చేయనివ్వడంలేదు అన్నిపనులూ మీరే చేసుకుంటున్నారు. మీరు నన్ను ఏపనీ చేయనీయకపోతే నన్నిక్కడికి ఎందుకు పిలిచినట్టు! బాబూ చెప్పండి." అన్నాడు

"నీకు ఏపనీ చెప్పననేకదా నిన్ను తీసికొనివచ్చాను" అన్నాడు.

"పని అంటే ఏమిటో అనుకున్నాను బాబూ! ఇలాంటి పనైతే ఏదైనా చేసేస్తాను" అన్నాడు.

"అంతపని చెయ్యకు నీ వెంతపని చేయడానికైనా సమర్థుడవని నాకు బాగా తెలుసు. కాని నీకు పనిచెప్పి కష్టపెట్టడం నా కిష్టంలేదు."

"ఇందులో కష్టం ఏముంది బాబూ! ఇవన్నీ నా కలవాటు అయినపనులే బాబూ! నేను మీకూడు తింటూన్నాను గోళ్ళుగిచ్చుకుంటూ కూర్చోలేనుబాబూ! నాకుకూడా పని చెప్పండి చేస్తాను." అన్నాడు ఆవేశంతో.

"ఏం పనులు చేస్తావు?"

"చెప్పండిబాబూ. ఏపటి చెయ్యమంటే అది చేస్తాను. ఇదివరకు పని చెయ్యగలిగినా, ఎందుకు చెయ్యాలని



"ఏం కక్కాయ్, ఈ మధ్య అసలు నవ్వటం మానేశావు ?"
"నవ్వితే బంగారపుపళ్ళు బయటపడవూ ?"

ఎగే సేవాణ్ణిబాబూ. నిజం చెప్తొన్నాద్దూ. కాని మీలాటి మంచివాళ్ళు కష్టపడటం చూడలేనుబాబూ! చెప్పండి, ఏమిటి చెయ్యమంటే అది చేస్తాను" అన్నాడు.

"అన్నిపనులూ నీవు చెయ్యనక్కరలేదు. నేను చెప్పిన పను లేవో చెయ్యి. ఈ ప్రాంతంలో దొంగభయం ఎక్కువ. నేను యింటిలో లేనప్పుడు ఈ యింటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి నీవు. ఈ ఇల్లంతా నీదే. నీవు ధైర్యవంతుడవని నీ కీపని ఒప్పగిస్తున్నాను" అన్నాడు రాజారావు.

"దొంగలా బాబూ! నే నీ యింటిలో ఉండగా ఈ యింటివైపు రావడానికి ఎవడికి బాబూ గుండెలు? మీ కాభయం అక్కరలేదు బాబూ. ఈ యింటిని, బాబును, అమ్మగార్ని నా ప్రాణంగా చూసుకుంటాను బాబూ" అన్నాడు, దగ్గరే బొమ్మల్తో ఆడుకుంటున్న వాసును ఎత్తుకొని ముద్దాడుతూ.

"అలాగే నీమీద నాకు మంచినమ్మకముంది. నీ పేరు రంగడే కదూ?"

"అవును బాబూ! నా పేరు రంగడే. మా అమ్మా, మా అయ్యా రంగా! అనే పిలిచేవారు బాబు! చచ్చిపోయి ఏ

లోకాన్న వున్నారో" అన్నాడు కన్నీళ్లు తెచ్చుకుంటూ.

"విచారించకూ రంగా! నే నున్నాగా" అన్నాడు రాజారావు.

"ఎంత చల్లగా పిలిచారు బాబూ! నన్ను 'రంగా' అనే పిలవండి బాబూ! అలాగే పిలవండి" అంటూ కన్నీళ్ళు తుడుచుకున్నాడు రంగడు.

ఆనాటినుండీ రంగడు రాజారావు నమ్మినబంటు. ప్రతీరోజూ ఉదయాన్నే రాజారావుతో లేచి ఇంటికి కావలసిన నీళ్ళు దూరంగా ఉన్న వీధి కులాయి నుండి మోసుకొచ్చేవాడు. తోటలో మొక్కలకు నీళ్ళు పోసేవాడు. బజారు నుండి కావలసిన కూరగాయలు కొని తెచ్చేవాడు. రాజారావు ఆఫీసుకు వెళ్ళిపోయిన సమయంలో వాసును దగ్గర కూర్చోబెట్టుకొని ఆడించేవాడు. సాయంకాలం ఇంటికి కావలసిన నీళ్ళు పట్టేసి, వాసుకు నీళ్ళు పోసి ముస్తాబు చేసేవాడు. రాజారావు ఆఫీసునుండి రాకమునుపే వాసును భుజాన వేసికొని రాజారావు వెంట బజారుకు బయలుదేరేవాడు. రాజారావు దగ్గరినుండి ప్రాపంచక విషయాలు చాల తెలిసికున్నాడు రంగడు. రాత్రి భోజనం చేసి వాసుతో కబుర్లాడుతూ వాసు నిద్రపోగానే నిద్ర కుపక్రమించేవాడు రంగడు

వాసుకు రంగడిదగ్గర బాగా చేరిక అయింది. రాత్రిళ్ళుకూడ రంగడిని విడిచిపెట్టేవాడు కాడు వాసు. రాత్రిళ్ళు రంగడిదగ్గరే నిద్రపోయేవాడు. కాని శారదమ్మకు ఇదేమీ యిష్టం ఉండేది కాదు. రంగడు రాజారావుకు సన్నిహితుడైనా, శారదమ్మకు మాత్రం రంగడు అంతంత దూరంలోనే ఉండిపోవలసి వచ్చింది. ఆమెకు రంగడంటే సదభిప్రాయం లేదు. ఇంటిలో ఏ వస్తువు కనపడకపోయినా, రంగడే తీసి ఉంటాడని ఆరోపించే దామె. కాయగూరల కోసం బజారుకు రంగడిని పంపడం ఆమెకు ఏమాత్రం యిష్టముండేదికాదు. ఇచ్చిన డబ్బులో 'పావలో,మూడణాలో' సంగ్రహిస్తాడని ఆమె వాదన. రంగడి చేరికతో వాసు పాడయిపోతున్నాడని ఆమె బాధ. రంగడు త్రాగిపారేసిన చుట్టపీకలు వాసు నోటిలో పెట్టుకుంటున్నాడని, వాడి యాసమాటలే వాసుకు అలవడుతున్నాయని ఆమె ఆరోపణలు. రంగడి చూపులెప్పుడూ వాసు మెడలోని 'పులిగోరు' పతకంమీదా, చేతికున్న నీలం రాయి ఉంగరంమీదే నని ఆమె వాదన.

ఒకరోజు రాత్రి రాజారావు శారదకు సమాధానం చెప్పవలసివచ్చింది.

"శారదా! వాడు చుట్ట త్రాగవచ్చు. వాడి మాటలు స్వచ్ఛంగా లేకపోనూ వచ్చు. వాడు ఒకప్పుడు దొంగ కావచ్చు. అంతమాత్రంచేత వాడిని విద్వేషించడం తగదు. వాడు మనలను పూర్తిగా నమ్మాడు. నేను వాడిని నమ్మాను.



నమ్మినవా డెవడూ చెడిపోడు. ఈ క్షణం వాడిని ఇంటిలోంచి పొమ్మన్నా వాడు పోడు; పోలేడు. ఈ మూడునెలలలో వాడి ప్రపంచజ్ఞానం ఎంత పెరిగిందో తెలుసా? ఇంతకుముందు హైదరాబాదుకు, నిన్నూ, బాబునూ ఒంటిగానిడిచి పోవడమంటే భయపడేవాడిని కానీ వాడుండగా ఎవరికీ ఏ ఆపదా రానివ్వడు. ఆ నమ్మకం నాకు బాగా ఉంది. వచ్చే నెలలో హైదరాబాదు వెళ్ళినా చాల నిశ్చింతతో వెళ్ళిరాగలను" అన్నాడు, స్వేచ్ఛగా ఊపిరి తీస్తూ.

"వచ్చేనెలలో హైదరాబాద్ వెడతారా? రంగడా మాకు కాపలా?" అందామె.

"ఏం ? అలా ఆశ్చర్యపోతున్నావు?"

"మీ కలాగే ఉంటుంది. మాటల్లో మనిషి తత్త్వం పూర్తిగా తెలియదు. మీరు ఆఫీసుకు వెళ్ళినప్పుడు వాడు చూచే వాడిచూపులు ఎంత భయంకరముగా ఉంటాయో మీ కేం తెలుసు? వాడు చూస్తూండగా ఇల్లు సవరించడం అంటే నాకు భయం. వాడి చూపు లెప్పుడూ బాబు మెడలోని 'పులిగోరు పతకం' మీదే అలాంటి ఒక దొంగవెధవను ఇంటిలో వదలి వెళ్ళిపోతా నంటున్నారు. మీరు లేనివేళ ఏ పట్టపగలో నా మెడ పిసికి, ఇంటిలో ఉన్నది కాస్తా ఊడ్చుకెళ్ళి పోతే మా కెవరుదిక్కు చెప్పండి." అంది ఆతని రెండుభుజాలు ఊపుతూ.

బెడ్ రూం దీపం కాంతిలో ఆమె కను కొలకులలో నిలచిఉన్న కన్నీళ్ళు చూచాడు రాజారావు. ఆమె భుజాలమీద చేతులేసి, "శారదా! నీ వనేది నేను కాదన లేను. కాని అలాటి దేదీ జరగదనే నా నమ్మకం. నమ్మకాన్ని మించిన దేవుడు లేడు శారదా! దేవుడు మన నమ్మకం చేత ఏర్పడ్డవాడే. నీవు నన్ను నమ్మేవు. నన్ను దైవంగా ఆరాధిస్తున్నావు. అలాంటి నిన్ను ప్రేమతో లాలించ వలసిన ఈ చేతుల్తో ఈ క్షణంలో నీ మెడను పిసికిపారేస్తానా? నన్ను అంతగా నమ్మిన నీకు ద్రోహం చేయ గలనా? నేను దుర్మార్గుడినే కావచ్చు. కానీ నీ ప్రేమానురాగాలవల్ల మేల్కొన్న మానవత్వం అంత దుర్మార్గానికి ఎప్పుడూ నన్నాపని చేయనీయదు. మానవులు చేయవలసిన పని తమలోగాని ఎదుటివారిలోగాని 'నిద్రపోతున్న మానవత్వాన్ని' మేల్కొల్పడమే. ఇంతకీ సూటిగా చెప్పు; నా మీద నీకు నమ్మక ముందా!"

"ఇన్నాళ్ళు నాతో జీవితాన్ని గడిపిన మీ రడిగే ప్రశ్న ఇదేనా? చెప్పండి. మిమ్మల్ని నమ్మనట్టు ఎప్పుడైనా ప్రవర్తించేనా?" అని అడిగింది అతని గుండెల మీద వ్రాలిపోతూ.

"సరదాగా అన్నమాట కీ కన్నీ రెందుకు శారదా? నీవు నన్ను నమ్మినట్టే రంగడు నన్ను నమ్మాడు. వాడిని నేను నమ్మాను. వాడు నా నమ్మినబంటు. వాడి వలన ఎవరికీ ప్రమాదం ఉండదు. నీవు నిశ్చింతగా ఉండు వారం రోజుల్లో తిరిగి వచ్చేస్తాను" అన్నాడు తల నిమురుతూ రాజారావు.

2

రాజారావు హైదరాబాద్ వెళ్ళేరోజు వచ్చింది. రాజారావు, ఏ పూలమొక్కకు ఏలాటి సంరక్షణ చేయాలో లాంటి చిన్న విషయాలదగ్గరినుండీ యింటి బాధ్యత లేవేవి ఎలా నిర్వహించాలో లాంటి విషయా లన్నీ రంగడికి బోధించాడు. శారదమ్మను, బాబును జాగ్రత్తగా చూడ మని చెప్పాడు. వారిని తన ప్రాణ

పదాంగా చూచుకుంటా నని హామీ యిచ్చాడు రంగడు.

శారద దగ్గర వీడుకోలు తీసికొని, బాబును ముద్దాడి బయలుదేరాడు రాజా రావు. స్టేషన్‌కి దిగబెట్టి, అతన్ని రైలె నెక్కించి "త్వరగారాండి బాబు మీరు లేకపోతే బెంగెట్టుకుంటాడు" అని హెచ్చరించాడు. బండి కదలేంతవరకూ ఉండి గృహోన్ముఖు డయ్యాడు భారంగా రంగడు.

మూడు రోజులూ మూగగా గడిచాయి.

ఆ మూడు రోజులూ రంగడికి ఆమె ఏ పనీ పురమాయించలేదు. బాబును రంగడితో చేరనివ్వలేదు. రంగ డెవరో, తా నెవరో అన్నట్టు ప్రవర్తించిం దామె. 'బాబూ! బాబూ!' అని అరచి ప్రయోజనం లేక తోటలో ఒక మూల ఏ మొక్కకో మడి త్రవ్వుతూ కూర్చునే వాడు రంగడు. బాబుకి నీళ్ళు పోయటానికికూడా దగ్గరికి రానిచ్చేదికా దామె. రంగడికి ఆమె ప్రవర్తన అర్థం కాలేదు. బాబు తన కోసం ఏడ్చి మొత్తుకున్నా ఆమె రంగడి దగ్గరికి బాబును పంపించేది కాదు. రంగడిలో ఎవరికీ చెప్పుకో లేని బాధ గుండెలో ముద్ద కట్టుకు పోయింది. ఎప్పుడూ, ఎవరికోసం పొందని ఆవేదన అతనిలో నిండి పోయింది.

ఆ మూడు రోజులూ శారదమ్మలో భయాలు సుళ్ళు తిరుగుతునే ఉన్నాయి. ఏమీ జరుగకపోయినా ఏదో ప్రళయం జరుగుతున్నట్టే ఆమె బాధపడేది. ఆమె మనసు వివిధ రకాలైన కథలల్లసాగింది. అనుమానం సాలెపురుగు లాంటిది. ఎంతటి మానవుడైనా ఆ సాలె గూడులో చిక్కుకుంటే 'ఈగ'కు పట్టిన గతే పడుతుంది. ఆ సాలెగూడు నుండి విముక్తి పొందాలంటే ఆ సాలెగూడును అల్లే సాలెపురుగునే నాశనం చెయ్యాలి. శారద మాత్రం అనుమానపు బంధాల లోంచి విముక్తి పొందలేకపోయింది.

ఆ రోజు ఉదయం బాబుకు నీళ్ళు పోయబోయి అతని కాళ్ళు వెచ్చగా ఉండడం గమనించి 'బాబు ఒళ్ళు వెచ్చగా ఉన్నద'ని గొణుగుకుం దామె. రంగ డామె మాటలు విని 'బాబుకు నీళ్ళు పోయకం డమ్మా' అని వాదించాడు. నిజానికి రంగడు వాదించకపోతే ఆమె నీళ్ల పోసేదేకాదు కాని రంగడు వద్దన్నాడు కనుక ఆ పని చేసితీరాలని సిద్ధాంతీకరించుకొని 'ఒంటిలో ఉడుకు' అని సమర్థించి నీళ్ళు పోసేసింది. తల్లి నీళ్ళు పోయాగానే 'జోగుతూ' తల్లి దృష్టినుండి తప్పించుకొని రంగడిని చేరాడు వాసు. పదిగంటలవేళకు వాసు ఒళ్ళు కాగిపోతూండటం గమనించి శారదమ్మకు చెప్పాడు. ఆమె కంగారు పడిపోయింది. జ్వరం తగిలిందని నిర్ధారణ చేసింది. రంగడు బాబు ప్రక్క మరం వేశాడు. జ్వరం తగ్గడానికి ఏం చేయాలి? ఏ

మందులు వేయాలి? అని పదే పదే ప్రశ్నించాడు రంగడు. విసుక్కుంటూ తనకు తోచిన సమాధానా లిచ్చిం దామె. జ్వరం తగ్గడం కనుపించలేదు సరికదా క్షణక్షణానికీ ఎక్కువవుతూనేఉంది. శారదమ్మ రంగడిని డాక్టరు దగ్గరికి పంపించింది. డాక్టరు అక్కడికి రెండు మైళ్ళ దూరంలో నున్న పల్లెటూరు వెళ్ళ డంచేత శారదమ్మ తనకు తోచిన మందులు వాడింగి. కాని జ్వరం తగ్గే సూచన లేవీ కనుపించలేదు. కనుపించినవారి నెల్ల మందడగడంతో, మాటిమాటికీ జ్వరం తగ్గిందేమో చూడటంతో రంగడికి ప్రొద్దుపోయింది.

సాయంత్రాల్లోంచి రాత్రిళ్ళలోకి ప్రయాణించింది దినకన్య, నిశిలో ఉండే అమావాస్యచుక్కలతో ఆడుకోడానికి. జూన్‌నెల ప్రవేశించినప్పటికీ కొండల చేత పరివృత్తమైన ఆ ఊరిని ఎండ తీవ్రత విడిచిపెట్టలేదు. వేడిగాలి ఇంకా వీస్తూనేఉంది. ఏ అర్ధరాత్రికోగాని వాతావరణం చల్లబడదు. చంద్రుడు లేని కారణంగా ఇంకా అమితమైన ఉడుకుగా ఉం దావేళ. డాక్టరు వూరినుండి వచ్చాడేమో కనుక్కోడానికి పరుగెత్తాడు రంగడు. డాక్టరుగారు ఆ రాత్రికి రారని కాంపౌడరు చెప్పాడు. అదే వార్త భారంగా చెప్పాడు రంగడు శారదమ్మకు. ఆ రోజు రాత్రి శారదమ్మకుగాని, రంగడికిగాని భోజనాలులేవు. బాబు జ్వరం తగ్గే సూచన లేవీ కనుపించలేదామెకు. ఎవరి సహాయమైనా అడుగుదామంటే ఆ చుట్టుప్రక్కల ఆమెకు తెలిసిన వారెవరూలేరు. ఉన్నా ఎవరూ పట్టించుకోరు ఏమి చేయాలో ఆమెకు తోచలేదు.

గడియారం తొమ్మిది కొట్టింది.

బాబు పలవరిస్తున్నాడు. ఆ పలవరింపులలో రంగడి పేరే ధ్వనిస్తోంది.

తనకు తాను కల్పించుకొని మాట్లాడని శారదమ్మ ఆ రోజు బాబు నుదుటన తడి గుడ్డ వేస్తున్న రంగడిని పిలిచి దీనంగా అడిగింది:

"రంగా ఏమి చేయాలిప్పుడు? ఆయనా ఊళ్లోలేరు. బాబుకి అకస్మాత్తుగా వచ్చిన ఈ జ్వరానికి డాక్టరు లేకపోవడంతో, తెలిసినవాళ్ళెవరూ లేకపోవడంతో, బాబు ఏమైపోతాడో అని భయమేస్తోంది. ఆ మధ్య ఎక్కడో విష జ్వరానికి ఇరవైనాలుగు గంటల్లో ఒక ఆడపిల్ల చచ్చిపోయిందట. బాబు ఏమైపోతాడో రంగన్నా!" అని విలపించిం దామె.

"అమ్మా! నన్నేం చేయమంటారో చెప్పండి. మీ రేం చెయ్యమంటే అది చేస్తాను. బాబును బ్రతికించడానికి నా ప్రాణాలైనా యిస్తానమ్మా!" అన్నాడు దీనంగా రంగడు.

"ఏం చేయాలో తెలిస్తే నా కింత బాధెందుకు బాబూ! డాక్టరు వచ్చినా బాగుండేది. కాని ఆ డాక్టరు రెండుమైళ్ళ

దూరంలో కూర్చున్నాడు. నాకేం తోచడం లేదు బాబూ! బాబు ఏమైపోతాడో!" అని ఏడ్చిందామె.

రంగడు ఆలోచనలోపడ్డాడు.

"అమ్మా! ఒక పని చేస్తే," అన్నాడు చటుక్కున.

"ఏమిటది ?" అందామె.

"బాబునే డాక్టరు దగ్గరికి తీసికొని పోతానమ్మా. డాక్టరుకు చూపించి మందు యిప్పించి, వీలయితే, సూదిమందు వేయించి మరీ వస్తానమ్మా; చెప్పండి. ఇప్పుడు ఇంతకన్నా ఏం చేయగలం ?" అన్నాడు.

'బాబును రంగడి కొప్పగించడమా ? ఆ కసాయివాడి చేతిలో పెట్టడమా ? తాను ప్రాణప్రదంగా చూచుకునే బాబును 'పులిగోరు పతకం'కోసం చంపేస్తే తా నేం చేయగలదు ?' ఈ విధంగా ఆలోచనా తరంగాలు ఆమె మెదడులో దాడిచేసాయి.

ముందుగా ఆమెకా ఆలోచన వచ్చినా 'పులిగోరు పతకం'కోసం బాబును ఏం చేస్తాడో అన్న సంశయం ఆమెను వీడలేదు. పోనీ 'పులిగోరు పతకం' తీసేసి పంపిద్దామా బాబునంటే, రంగడు తన్ను అనుమానిస్తాడేమో అన్నభయం యింకొకవైపున పీడించసాగింది. ఆ ఆలోచనలతో ఆమె యిదమిత్థంగా ఏదీ నిర్ణయించలేకపోయింది.

"అమ్మగారూ! ఏం టాలోచిస్తున్నారింకా. మీరు 'ఊ' అనండమ్మా ఒక్క నిముషంలో డాక్టరుదగ్గిరికి పరుగెత్తి బాబును తెస్తానమ్మా!" అన్నాడు.

కొద్దిసే పాలోచించి "సరే! నీయిష్టం రంగన్నా," అందామె.

తలపాగా సవరించుకున్నాడు రంగడు. బాబుకు వంటిమీద బాగా దుప్పటి కప్పి ఒకచేతిలో హరికెన్‌లాంతరు తీసికొని, ఇంకొకచేతితో బాబును గుండెపైనుంచు కొని "అమ్మగారూ! వెళ్ళొస్తాను. శుభంగా రమ్మని దీవించండమ్మా !" అన్నాడు రంగడు.

శారద కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. రంగడిని సమీపించి "రంగన్నా! బాబును నీచేతిలో పెడుతున్నాను. వాడిని మరల నాచేతికి ఒప్పగించే బాధ్యత నీదే. వాడిప్రాణాన్ని ఎలా కాపాడుకుంటావో" అందామె తన భయాన్ని వ్యక్తపరుస్తూ.

"భయం లేదమ్మగారూ! బాబుకు నాప్రాణం అడ్డు" అని చెప్పి చీకటిలో దారి వెతుక్కుంటూ బయలుదేరాడు.

ఊరికి దూరంగా విసిరివేయబడిన ప్రైవేటు క్వార్టర్సుకు, ఊరితో ఏమీ సంబంధమున్నట్టు తోచదు ఆయిళ్ళల్లో కూడా ఒకయింటికీ, ఇంకొకయింటికీ సంబంధం ఉన్నట్టుకూడా ఎవరూ భావించరు. ఎవరిబాధ వారిది. ఎవరి స్వార్థం వారిది. ఆ చుట్టుప్రక్కల ఉన్న పూరిళ్ళలో కాపుసారా కాస్తూండటం, అలగాజనం, అక్కడ త్రాగి, తందనా

లాడి, బూతులు తిట్టుకోవడం పరిపాటే అయిపోయింది.

ఆ ప్రాంతానికి నాలుగు ఫర్లాంగుల దూరంలో నున్న 'ఖార్కానా' నుండి దొంగలు తాము దోచిన వస్తువులు తెచ్చి, ఆయిళ్ళకు కాస్త ఆవలగా నున్న మైదానంలో పంచుకోవడం, ఆమైదానంకు ఆవలవైపున నున్న మామిడితోపులో వాళ్ళు తలదాచుకోవడం రంగన్నకు తెలిసిన విషయాలే. ఒకొప్పుడు అతను కూడా ఆవిధంగా వ్యవహరించినవాడే. అతనికీ తెలుసు తాను వెళ్ళే ప్రాంతంలో ఎలాటి ప్రమాదాన్నైనా ఎదుర్కోవలసి వస్తుందని. కాని ధైర్యంగా ముందుకు సాగాడు.

దారిఅంతా రాళ్ళతోనూ, ముళ్ళతోనూ ఆవరింపబడిఉంది. ఎక్కడ, ఏమూల ఏంఉందో, ఏమూలనుండి ఎవరు వచ్చి పడతారో తెలియదు. కాని హరికెన్ లాంతరు వెలుగులో ధైర్యంగా గబగబా అడుగులు వేసుకుంటూ ముందుకు నడిచాడు రంగడు. ఆ ప్రక్కదారివెంట రెండుఫర్లాంగులు నడిచాడంటే రోడ్డు ఎక్కిపోగలడు. రోడ్డు ఎక్కాడంటే పల్లెటూరు చేరాడన్నమాటే. కాని ఆ మాత్రపుదూరం వెళ్ళడం ఎలా? అసాధ్యమా? అసాధ్యం అన్నది మానవుని శక్తిసామర్ధ్యాలకు సంబంధించిన విషయం. రంగడికి తన శక్తిసంపద మీద సంపూర్ణ విశ్వాసం ఉంది ఆ నమ్మకం తోనే ముందుకు అడుగులు వేస్తున్నాడు. పదిఅడుగులు వేశాడు.

దూరంగా చీకటిలో నాలుగు ఆకారాలు కదిలాయి. రంగడిగుండె దడదడలాడింది. అయినా గుండె చిక్కపట్టుకొని ఇంకొక రెండడుగులు వేశాడు. నాలు గడుగులు దగ్గరయ్యాయా ఆకారాలు. చీకటిలోనే పరీక్షగా చూచాడు ఆ ఆకారాలవైపు. ముందుకు అడుగు వెయ్యబోయాడు. నాలుగు ఆకారాలూ దగ్గరై చుట్టుముట్టాయి. రంగడు ఆగి అన్నాడు "నేను డాక్టరు దగ్గరికి పనుండి వెడుతున్నాను. దయచేసి తప్పుకోండి."

"నీవు డాక్టరు దగ్గరకే వెళ్ళు, దయ్యందగ్గరికే వెళ్ళు; మాకు కావలసింది డబ్బు. నీ చేతిలో దేమిటి? నీ దగ్గర ఉన్నది పారేసి నీ యిష్టమొచ్చినచోటికి వెళ్ళు." అన్నా డొకడు.

"వా డిచ్చే దేమిటి? మనమే చూదాం" అన్నా డొకడు సాహసంతో.

"ఆగండి. నా ఒంటిమీద చెయ్యి వేశారంటే మిమ్మల్ని బ్రతుకనివ్వను. దారివ్వండి" అని గర్జించాడు రంగడు.

"ఏయ్" అని కట్టె ఎత్తా డొకడు.

"ఆగు" అంటూ లాంతరు నేలమీద పడేసి ఒక్క వూపులో కట్టె చేచిక్కించుకున్నాడు రంగడు. తన కట్టెసాముविద్య నలుగురిమీదా ప్రదర్శించాడు. మూడు కట్టెలు ఒక కర్రతో తలపడ్డాయి రంగడు విజృంభించాడు. తన ఒంటిమీదగాని బాబు



ఒంటిమీద గాని, ఒక్క దెబ్బపడకండా కాపాడుకొంటూ నలుగురికీ సమాధానం చెప్పాడు రంగడు. కలియపడ్డవారిలో ఇద్దర్ని చిత్తుగ కొట్టి మూడోవాడిమీద దాడి చేశాడు. వాడు మిగితా యిద్దర్నీ అనుసరించాడు. నాలుగోవాడు మాత్రం రంగడి తలమీద బలంగా కొట్టి రంగడి కఱ్ఱ దెబ్బకు తట్టుకోలేక క్రింద పడిపోయాడు

రంగడు తలపాగాను చుట్టుకొని రక్తం కారిపోతున్నా లెక్కచేయకుండా శక్తి కూడదీసికొని, కిరసనాయిలు ఒలికి ఆరిపోయి నేలమీద పొర్లాడే హరికెన్ లాంతర్ని వదలి ముందుకు బయలుదేరాడు.

నీరసంగా తేలిపోయే కాళ్ళను బలంగా వేస్తూ, రోడ్డు ఎక్కి పల్లెటూరి

వైపు ప్రయాణించాడు రంగడు. మనిషిని ధైర్యం ఎంతపని అయినా చేయిస్తుంది. అదే ధైర్యం, అదే దీక్ష రంగడిని ముందుకు పొమ్మని ప్రోత్సహించాయి. డాక్టరు యింటిముందు వ్రాలాడు నీరసంగా తేలిపోయే శరీరంతో. విషయం క్లుప్తంగా చెప్పి పడిపోయాడు రంగడు.

డాక్టరుకు పరిస్థితి అర్థమైంది.

వెంటనే బాబుకు మందు యిచ్చి, వెనువెంటనే ఇంజక్షన్ యిచ్చి, రంగడి తలకు కట్టుకట్టాడు. కాఫీ త్రాగిన పిమ్మట కొద్దిగా తేరుకున్నాడు రంగడు గడియారం పన్నెండు కొట్టింది. గడియారం వైపు చూశాడు రంగడు. వెంటనే బాబు వైపు దృష్టి సారించి 'బాబు కెలావుంది?' అని ప్రశ్నించాడు. తాను బాబుకు మందు యిచ్చిన సంగతి చెప్పి జ్వరం తగ్గుతుంది, కంగారు పడవద్దని చెప్పాడు డాక్టరు. రంగడు లేచి బాబును తీసికొని బయలుదేరబోయాడు. డాక్టరు వెళ్ళవద్దని, తెల్లవారిన తర్వాత తాను పంపిస్తా నని చెప్పాడు. కాని రంగడు వినలేదు.

"అమ్మగారు మాకోసం వెయ్యి కన్నులతో ఆతృతగా చూస్తుంటారు. బాబును అమ్మగారికి ఒప్పగిస్తేగాని నాకు నిద్రపట్ట" దన్నాడు రంగడు.

"నీవు వెళ్ళలేవు" అన్నాడు డాక్టర్.

"కాని నేను వెళ్ళాలి" అన్నాడు రంగడు.

గడియారం ఒంటిగంట కొట్టింది.

ఆతృతగా తల ఎత్తి వీధిలోనికి పరుగెత్తిపోయి చూచింది. రంగడి జాడ కనుపించలేదు. మనసు వెయ్యి అపశృతులు పలుకసాగింది. వీధిలో నిల్చుని నిశీధిలోనికి చూస్తూ నిలుచుంది. దూరంగా ఎవరో బాబు పీక పిసుకేస్తున్నట్టు, బాబు అరుస్తున్నట్టు అనిపించింది. క్షణాలు యుగాలుగా గడిచిపోతున్నాయి.

రంగడిజాడ కనిపించలేదు. చీకట్లో ఒక కారు కదలివచ్చి ఆగింది. శారదమ్మ కళ్ళలో ఆశ మెరిసింది. డాక్టరు బాబు నెత్తుకొని రావడం కనుపించింది.

"బాబు కెలా ఉంది? రంగ డేడీ?" అని ఆత్రంగా అడిగింది.

"రంగడికి దెబ్బలు తగిలాయి. హాస్పిటల్‌లో ఉన్నాడు. బాబుకు ఒక గంటలో తగ్గిపోతుంది. బాబుకు ఈ మందు ఇవ్వండి. రంగడిని రేపు పంపిస్తాను" అంటూ డాక్టరు కారెక్కాడు.

* * *

రాజారావు హైదరాబాదునుండి రాగానే శారదమ్మ బాబుతో ఆడుకునే రంగడిని చూపి "రంగడు ఎంతమంచివా డనుకున్నారు!" అన్నమాటలు విని రాజారావు ఒక్కసారి నివ్వెరపోయాడు.